# ఇరుగూ - పొరుగూ

మధ్యాహ్నం తల నొప్పిగా ఉంది. సాయంత్రానికది కాస్త జ్వరంగా మారింది. పనిమనిషి ఏదో పెళ్ళికి వెళ్ళాలని రెండురోజులదాకా రానని నిన్ననే చెప్పి వెళ్ళింది. ఒంట్లో బాగున్నా బాగుండకపోయినా, ఇంట్లో ఆడదానికి లేవక తప్పదు. వండక తప్పదు. మరి పొద్దుటి నుంచి బయట చాకిరీచేసి అలసిన మనిషి ఇంటికి రాగానే వస్తుంటాడా ? మగవాడు ఇంటికి వచ్చేటప్పటికి ఇల్లు బాగుండాలి, వంట బాగుండాలి, ఎదురుగా వచ్చే ఆడది బాగుండాలి !

ఓపిక లేకపోయినా లేచి రెండు అనాసిన్ మాత్రలు వేసుకుని, కాస్త తేరుకుని, ఆయనకు మాత్రం కాస్త అన్నం చారు చేసిపెట్టాను. స్నానానికి నీళ్ళు కాచి పెట్టాను. కాఫీ రెడీగా పెట్టాను. అన్నీ అయ్యాక మళ్ళా మగతగా ఉంటే పడక్కుర్చీలో పడుకున్నాను ఆలోచిస్తూ రాత్రి భోజనా లప్పుడు చారు మాత్రమే చేసినందుకు క్షమాపణ ఎలా చెప్పుకోవాలో రిహార్సలు చేసుకుంటూ ! ఇంటికి రాగానే 'నీకు ఒంట్లో బాగుందా ?' అని అడిగే ఓపిక ఆయనకెప్పుడూ ఉండదు. అసలు ఆ ఆలోచనే రాదు. రాగానే, 'ఉత్తరాలు వచ్చాయా ? కాఫీ పట్టుకురా ! స్నానం చెయ్యొచ్చా ?' ఇలాగే ఉంటుంది ధోరణి. ఇవన్నీ అయిపోగానే గత రాత్రి పన్నెండు గంటలకు సగం వదిలేసిన డిటెక్టివ్ నావల్ గుర్తుకొస్తుంది. అంతే ! ఇంక అది పట్టుకుకూర్చుంటారు. ఇంట్లో ఇంకో మనిషి ఉన్న స్పృహ కూడా ఉండదు. పాపం-మరయంత్రం కూడా మధ్యలో 'కీ' ఇవ్వకపోతే ఆగిపోతుందని ఆయనకు అప్పుడు తట్టదు.

ఆవేళా అంతే ! అన్నీ ముగించుకుని నవలపట్టుకు కూర్చున్నారు హాల్లో ! సరే బాగానే ఉందిలే అనుకుని నేను లోపలకెళ్ళి పడుకున్నాను. సరిగా ఎనిమిది గంటలకు ఇంక భోజనానికి పిలుద్దాం! ఏమీ అడగకముందే ఊరగాయల జాడీలన్నీ ముందు పెట్టేద్దాం అనుకుంటున్నాను. అంతలోకి గలగలా నవ్వుతో వచ్చేరారు. అవతల వీధిలో ఉన్న సరళ, ఆమె భర్త కృష్ణారావు.

అతను ఎప్పుడో మావారి క్లాస్‌మేటట ? ప్రస్తుతం ఇరుగూ పొరుగూ ! వాళ్ళని చూడగానే ఆయన ముఖం వికసించింది. అవతల నా ముఖం ముకుళించింది. అయినా లేని చిరునవ్వులు చిందించడం అడదానికి పుట్టుకతో వచ్చిన విద్య. నవ్వుతో వెళ్ళి సరళను పలకరించాను. "అలా శివాలయానికి వెళ్ళాం. వస్తూ వస్తూ మిమ్మల్ని చూద్దామని...." అంటూ నా చేతిలో కాస్త విభూతి పెట్టింది. ఎంతైనా దేవుడి ప్రసాదం కదా ! మెడకు రాసుకున్నాను. ఆయన సంతోషంతో స్నేహితుడితో అంటున్నారు "ఈ పూటకి ఇక్కడే భోంచెయ్యండిరా ! అందరం అలా నైట్‌షోకి పోదాం ! మీ ఇంట్లో ఎలాగూ వంటచెయ్యలేదు కదా!—" అని. నా గుండెల్లో రాయిపడింది. అయినా నవ్వుతూనే ఉన్నాను. కృష్ణారావు సరళ వంక చూశాడు. సరళ నవ్వింది. ఇద్దరూ నవ్వారు అంగీకారంగా !

నా తల తిరిగింది. ఇప్పుడు పొయ్యి అంటించి ఏం వంటచేసి పెట్టను ? అనాసిన్ ప్రభావం అప్పుడే తగ్గుతూ ఉన్నట్లుంది. మళ్ళా తల నొప్పి ప్రారంభమైంది. అయినా వంటఇంట్లోకి వెళ్ళాను. స్టవ్ ముట్టించి బియ్యం కడిగిపెట్టి, కూరలబుట్ట తీసుకున్నాను తరగటానికి. సరళ నా వెన కాలే వచ్చింది వంటఇంట్లోకి. ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. "మీరు ప్రెజర్ కుక్కర్ వాడరా ? ఏం ? కూరలు ధరలు మండిపోతున్నాయి కదూ ?

ఎక్కడ కొంటున్నారు ? ఆ కుంటికాలు మనిషి దగ్గరేనా ? అది మరీ దగాకోరండి. అయ్యో ! ఆ కొళాయి లీకవుతోందే ? వాషర్ వేయించక పొయ్యారా ?" ఈ వాగుడు వాన ఆగేటట్లు లేదు. నాకు వంట ఇంట్లో పరాయి మనిషి ఉంటే అసలు పనవదు. కాలూ చెయ్యీ ఆడదు. ఇంకొకరి సూపర్‌విజన్ నేనసలు భరించలేను అయినా తప్పలేదు ఆమె ప్రశ్నలకు, రిమార్కులకు "ఆ, ఊ" అంటూనే అలానే వంట ముగించాను. భోజనాలయాయి ఇంక సినిమా ప్రయాణం కావాలి. నేను రాననడానికి వీలు లేదు. వాళ్ళ సరదా పాడవుతుంది. పైగా ఒక్కదాన్నీ ఇంట్లో పడుండాలి. అలాగే వెళ్ళి వచ్చాను. తిరిగి వచ్చేటప్పటికి వళ్ళు మసలుతోంది.

ఆయన ఉక్కపోస్తోంది, డాబామీద పడుకుంటానని వెళ్ళిపోయారు. నాకు దుప్పటి కప్పుకున్నా చలి ఆగటంలేదు. మళ్ళా ఒక మాత్ర మింగి పడుకున్నాను. కాస్త కునుకు పట్టిందో లేదో టెలిఫోన్ మోగింది. మాకీమధ్యనే ఆఫీసు ద్వారా టెలిఫోన్ వచ్చింది. మాకు టెలిఫోన్ వచ్చిన రోజున ఇరుగూ పొరుగూ చాలా సంతోషించారు ఆ పక్క రెండు వీధులకి మాదొక్కటే ఫోన్. అందరికి మంచి ఉపయోగంగా ఉంది. అర్ధరాత్రి ఫోన్ వచ్చినా, ఎవరికోసం వచ్చినా అందుకోక తప్పదు. నిద్ర మాత్ర వేసుకున్నా ఫలితం లేదు. లేచి టెలిఫోన్ అందుకున్నాను. ఎవరిదో గొంతు "నరసింహాచారిని పిలుస్తారా కాస్త ? వెంటనే పిలవాలి". 'ఎవరీ నరసింహాచారి ? ఎక్కడ ఉన్నాడు ? ఎక్కడి నుంచి పిలుచుకువచ్చేది?' అమాయకంగా "ఇక్కడ ఎవరూ ఆ పేరుగలవారు లేరండీ !" అన్నాను. అవతలవాడు గద్దించాడు. "మీ నంబరు 2.0 యేనా?" బిత్తరపోతూ "అవును" అన్నాను. "అయితే నరసింహాచారిని అర్జంటుగా పిలవండి. బళ్ళారి నుంచి ట్రంక్‌కాల్ ఉంది" అన్నాడు. నాకేమీ పాలుపోలేదు. "ఇక్కడ ఎవరూ ఆ పేరుతో లేరండీ!" అన్నాను విసుగ్గా. వాడు విని

పించుకోలేదు. "కాస్సేపాగండి" అన్నాడు. ఆగాను. అవతల ఎవరితోనో ఏదో మాట్లాడాడు. మళ్ళా అన్నాడు. "మీ వీధికి అవతల వీధిలో నూట అయిదో నంబరు ఇంట్లో ఉన్నారటండి. అర్జంటుగా పిలవండి. ట్రంక్ కాల్! మళ్ళా లైను దొరకదు." ఈసారి నాకు నిజంగానే కోపం వచ్చింది. అర్ధరాత్రి ఎవర్నని ఎక్కడి నుంచి పిలుచుకురాను? "ఇక్కడ పిలవటానికి ఎవరూ లేరండి" అని చెప్పాను. వాడు వదిలేనా ? వదల్లేదు. పావుగంట కోసారి పిలుస్తూనే ఉన్నాడు. విసిగి రిసీవర్ తీసి క్రిందపెట్టేసి మళ్ళా పడుకున్నాను

నిద్ర పట్టడంలేదు. అప్పటికే అయిదు గంటలు కావస్తోంది. జ్వరం మాత్రం కాస్త తగ్గినట్టుంది. ఆలోచిస్తూ పడుకున్నాను రాత్రి ఏం సినిమా చూశామోకూడా గుర్తులేదు తెనుగు నవలల్లాగానే, అన్ని తెనుగుసినిమాలు ఒక్కలాగానే ఉంటున్నాయి. హీరోయిన్ జయప్రదా? జయసుధా? ఇద్దరూ ఉన్నట్లున్నారు. ఏదో ఆలోచిస్తూ పడివున్నాయి. ఎవరో తలుపు తట్టారు. ఇంక ఎలాగూ నిద్రకోసం ప్రయత్నించి లాభంలేదని లేచి కూర్చున్నాను. తలుపు తీశాను. ఎదురింటి శాస్త్రిగారు! ఆయన్ని చూడగానే వచ్చిన పని అర్థమయిపోయింది. "మా టెలిఫోన్ బాగా లేదండి" అని అబద్ధం చెప్పాను. ఆయన ఏమంత అమాయకుడేం కాదు. అంత సులభంగా వదలడానికి. "అర్జంటుగా కర్నూలు ట్రంక్‌కాల్ చెయ్యాలండి. కాస్త చూస్తాను." ఆహ్వానం లేకుండానే లోపలికి వచ్చి టెలిఫోన్ అందుకున్నాడు. నాకేదో మహా సంతోషకరమైనవార్త అందిస్తున్నట్లు, నవ్వుతో "టెలిఫోన్ బాగానే ఉందండి!" అన్నాడు. నేనేమీ మాట్లాడలేదు. పక్కచుట్టి లోపలికి వెళ్ళిపోయాను.

నేను లోపల గిన్నెలుకడిగి, వాకిలిఊడ్చి, పాలు పోయించుకుని, పేపరు తీసుకుని వచ్చేటప్పటికి శాస్త్రిగారు సుఖంగా సోఫాలో కూర్చుని

ఉన్నారు. నవ్వుతూ చెప్పారు "కాల్ బుక్ చేశాను. లైను బాగా లేదట. ఓ గంటలో ఇస్తానన్నాడు" అని. గంట, రెండు గంటలు లేదా మూడు గంటలు—ఎంతైనా ఇంక ఇవ్వాళ ఈయనగారి కంపెనీ నాకు తప్పదు. ఆయన ఆప్యాయంగా పేపరు నాచేతిలోనుంచి అందుకున్నారు కాలక్షేపానికి. ఇంక ఆ పూటకి ఆ పేపరు మాకు దొరకదు. ఉసూరుమంటూ లోపలికి వెళ్ళాను

కాస్సేపటికి ఆయన క్రిందికి దిగి వచ్చారు. శాస్త్రిగారు బాతాఖానీ మొదలు పెట్టారు. ఇద్దరికి కాఫీ పట్టుకెళ్ళి ఇచ్చాను. ఆయన పాపం ఆ రోజుకి పేపరు ఆశ వదలుకుని, ఆఫీసుకు టైం అయిందని భోంచేసి వెళ్ళిపోయారు. నేనూ భోజనం ముగించుకున్నాను. శాస్త్రిగారు హాల్లోనే ఉన్నారు. ఆయన కాల్ రాలేదు. ఆయన వెళితేగాని నేను కాస్త రెస్టు తీసుకోటానికి వీలుకాదు. ఎలాగ అని ఆలోచిస్తున్నాను. కాని పాపం ఆయనకే విసుగెత్తినట్లుంది. బుక్ చేసిన కాల్ కాన్సిల్ చేసి సాయంత్రం మళ్ళా వస్తానని చెప్పి వెళ్ళిపోయారు.

తలుపు వేసుకుని పడుకున్నాను కాస్త నిద్రపోతే అలసట తీరుతుంది. కొద్దిగా కునుకు పడుతోంది. ఎవరో కాలింగ్‌బెల్ నొక్కారు. తప్పనిసరిగా లేచి దేవుడా అని తలుపు తెరిచాను. పక్కింటి రంగమ్మగారి పనిమనిషి తులసి నుంచుని ఉంది. ఓ రెండు గిన్నెలు చేతిలో పట్టుకుని, ప్రశ్నార్థకంగా దానికేసి చూశాను, ఈసారి దీనికేం కావాలో అని. ఆ రంగమ్మగారు అన్నింటికి అంగడికి పంపించినట్లు మా ఇంటికి పంపిచటం అలవాటు. అది చెప్పింది "అమ్మా! అమ్మగారింటికి చుట్టాలొచ్చినారంట. పెరుగు, పాలు అడిగి పట్టుకురమ్మన్నారు" అంది. నా ముఖం మాడిపోయింది. మా ఇంటికి చుట్టాలొస్తేనే దిక్కులేదు. ఇంక వాళ్ళింటికి చుట్టాలొస్తారని నే నెందుకు పాలు, తోడుపెట్టుకుని ఉంచుతాను! అయినా

తప్పదు. ఆ రంగమ్మగారు మా వారి ఆఫీసరుగారి భార్య. బాగా డబ్బున్న మనిషి. ఆవిడకి లేదంటే బాగుండదు. ఇంకెవరైనా అయితే ఫరవాలేదు. అంచేత మిగిలిన కాస్త పెరుగు, నా కాఫీకోసం దాచుకున్న కాసిని పాలు రెండూ రెండు గిన్నెల్లో ఇచ్చి పంపాను.

అంతే! ఇంక మళ్ళా నిద్రపట్టలేదు. రాత్రి నిద్రలేక, రెస్టులేక మళ్ళా తలనొప్పి వచ్చింది. కాఫీ తాగుదామంటే పాలు లేవు.

సాయంత్రం వంటచేసిపెట్టి, శుభ్రంగా స్నానంచేసి కాస్త తేరుకుని కాస్సేపు విశ్రాంతిగా టి. వి. చూద్దామని హాల్లో కూర్చున్నాను. రిపేరుకు వెళ్ళిన టి. వి. ఆవేళ మధ్యాహ్నమే వచ్చింది. ఆయన సాయంత్రం కాస్త ఆలస్యంగా వస్తానని పొద్దునే చెప్పి వెళ్ళారు. ఎప్పుడు టి. వి. టైం అవుతుందా అని ఎదురుచూస్తూ కూర్చున్నాను. ఇంతలోకి ఎదురింటి చుక్కమ్మగారు వచ్చింది "వెధవలు! ఇంటిలో ఒక్కటే అల్లరండి. ఒకళ్ళ నొకళ్ళు తన్నుకోవడం కొట్టుకోడం! కాస్సేపు ఇక్కడ వుండనీయండి. టి.వి. చూస్తారు. వెధవలు టి. వి. చూపిస్తానంటే వచ్చారు" అంది. అంటూనే నా పరిష్మన్ ఏమీ అక్కర లేకుండానే పిల్లలను తీసుకువచ్చి టి. వి. ముందు కూర్చోపెట్టింది. అప్పుడు పరామర్శించింది నన్ను "బాగున్నారా? వంటైందా? మా కోడలు వచ్చేదాకా నాకు వీళ్ళతో గొడవ" అంటూ ఏదో సణుగుతూ చక్కా పోయింది.

ఉసూరుమంటూ కూర్చున్నాను. "టి. వి. ఎప్పుడు వస్తుందీ?" అంటూ ముగ్గురు పిల్లలు టి.వి. మీద ఒకేసారి విరుచుకు పడుతున్నారు. ఒకడు ఆన్ చెయ్యటానికి, ఒకడు చూడటానికి, మరొకడు సరిగా రాకపోతే అడ్జస్టు చెయ్యటానికి, నాకు గాబరా పట్టుకుంది. టి. వి. స్క్రీన్ పగులుతుందేమోనని, ఇంకా ఏడాది కాలేదు. ఓపిక లేకపోయినా బలవంతంగా పట్టి ముగ్గురిని ఇవతలకు లాగాను, మళ్ళా మరో అబద్ధం.

"టి. వి. చెడిపోయింది ఇవ్వాళ రాదు" అన్నాను. వాళ్ళు వినలేదు. ఆన్‌చేసి చూస్తామన్నారు. లేకపోతే రేడియో పెడతామన్నారు. టేప్ రికార్డరు లేదా అన్నారు. నా అదృష్టం, వాళ్ళ దురదృష్టం అన్నీ రిపేరులో ఉన్నాయని చెప్పాను. కాస్సేపు అక్కడే జుట్టు పీక్కుని, తన్నుకుని తరువాత వెళ్ళిపోయారు. మళ్ళా ఇంటికి వచ్చిన మనవలను చూసి చుక్కమ్మగారు మండిపడి ఉంటుంది, కాస్సేపు వాళ్ళను నేను ఉంచుకోలేదని నన్ను తిట్టుకుని వుంటుంది గొడ్రాలు పిల్లలనుచూస్తే గిట్టదు అనుకుని ఉంటుంది. అయినా ఏం చేస్తాం!

ఇంకా కాసేపువుంటే శాస్త్రిగారు మళ్ళా ట్రంక్‌కాల్ చెయ్యటానికి వస్తారేమోనని భయం వేసింది దీపాలన్నీ ఆర్పేసి, తలుపులన్నీ మూసేసి పడుకున్నాను.

మర్నాడు పొద్దునే మా పనిమనిషి మళ్ళా పునర్దర్శనం ఇచ్చింది. దాన్ని చూస్తే నా ముఖం కాస్త తేరుకుంది, మళ్ళీ ఈ కొంపలో చాకిరీ చెయ్యాలని వచ్చినందుకు.

ఆ సాయంత్రం మాపనిమనిషి గౌరి సావకాశంగా నా దగ్గరకువచ్చి కూర్చుంది. ఏదో సందేహిస్తున్నట్లు నసుగుతూ, నీళ్ళునములుతూ చెప్పింది. "అమ్మా! ఇరుగూ పొరుగూ మిమ్మలను గురించి ఏమనుకుంటున్నారో తెలుసా?" అంది. "ఏమిటి?" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాను. "అవునండమ్మా! అందరూ అంటున్నారు. అవిడ బొత్తిగా ఇరుగు పొరుగును చేరనివ్వదు. అలా అయితే ఎలా? ఎప్పుడైనా ఆవిడకిమాత్రం ఇరుగూపొరుగూ అవసరం రాదా? మనిషన్న తరువాత మరొక మనిషితో ఎప్పుడైనా అవసరం వస్తుంది కదా! అంటున్నారమ్మా!" అంది నిజమే! మనిషన్న తరువాత మరొక మనిషితో ఎప్పుడైనా అవసరంవస్తుంది. వాక్యం చాలాబాగుంది. కాని.... ఎందుకో మనసుమాత్రం ఏమీ బాగుండ లేదు. అలానే ఆలోచిస్తూ ఉండిపోయాను.